క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రచారం


కరప్రతాలతో అధ్యాపకుల ప్రచారం

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని కళాశాల అధ్యాపకులు గురువారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కళాశాలలో వసతులు, ఉన్నత విద్య, అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన జరుగుతుందని, టీఎక్‌కేసీ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెసుకోవచ్చాన్నారు. కాలేజీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయని, దోస్త్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని, అడ్మిషన్లు లిస్టు వచ్చిన అనంతరం ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ స్వరూప రాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు డాక్టర్ సువర్ణ, ఎంబడి రవి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రవిప్రకాశ్, మమత, సుష్మ, సుధాకర్, ప్రశాంత్, అరుణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో శిక్షణ


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

జమ్మికుంట: స్కిల్ అండ్ నాలెడ్జ్ శిక్షణ తరగతులతో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ అంశాలపై టాస్క్ ప్రతినిధి నిశాంత్ ప్రత్యేక శిక్షణ అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... శిక్షణ తరగతులు వినడంతో పాటు సాధన చేస్తే పోటీ పరీక్షల్లో సమయం ఆదాతోపాటు అర్థం చేసుకొని విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటస్ డాక్టర్ సువర్ణ, శ్రీకాంత్, ఐక్యూ ఏసి కోఆర్డినేషన్ ఎడమ శ్రీనివాస్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ రామ్మోహన్‌రావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్నఫౌండేషన్ నిర్వాహకులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన దాసరి భిక్షపతి అనే వికలాంగుడు కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు కిడ్నీలు పని చేయకపోవడంతో డయాలిసిస్ చేయాల్సి పరిస్థితి వచ్చింది. పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్‌గౌడ్ సేవా దృక్పథంతో ప్రతినెల రూ.2,500 సాయం చేస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పల్లె రవిగౌడ్, గండి రంజిత్‌కుమార్‌గౌడ్, కడవేరుగు సంపత్, డాక్టర్ గోపి, బండారి శ్రీనివాస్‌యాదవ్, తాటిగంటి వీరస్వామి, కారుపాలక వెంకన్న,గొడుగు రమేశ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన


రసమయి చిత్రపటానికి చీర బహూకరిస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్: కరీంనగర్ కదనభేరి సభలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. గురువారం మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తాలో రసమయి చిత్రపటానికి చీర, సారె బహూకరించి నిరసన తెలిపారు. బండి సంజయ్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాజిరెడ్డి, ప్రదీప్, రవీందర్, దేవేందర్‌రెడ్డి, మహేశ్, రమేశ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్: మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీయస్ బియ్యాన్ని పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మాదాసు రాజ్‌కుమార్ తెలిపారు. 30 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్న చిగురుమామిడి మండలం కొండాపూర్, ర్యాకలదేవపల్లికి చెందిన వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఇటు ఎండ.. అటు దుమ్ము

- ముమ్మరంగా కరీంనగర్‌–వరంగల్ రోడ్డు విస్తరణ పనులు
- రహదారి వెంట బస్టాండ్లు, చెట్ల తొలగింపు
- ఎడారిని తలపిస్తోన్న ప్రధాన స్టేజీలు
- బస్సులు, ఆటోల కోసం ఎండలోనే పడిగాపులు
- దుమ్ముధూళి భరిస్తూనే ప్రయాణం సాగిస్తున్న వైనం


బస్సులు, ఇతర వాహనాల కోసం ఎండలో ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

మానకొండూర్: నేషనల్ హైవే విస్తరణ పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి వెంట చెట్లు, బస్టాండ్లు, నివాసాలు, దుకాణాలను తొలగిస్తున్నారు. దీంతో ఆయా స్టేజీల వద్ద బస్సులు, ఇతర వాహనాల కోసం ప్రయాణికులు ఎండలోనే నిల్చుంటున్నారు. నీడ సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్, శంకరపట్నం మీదుగా సుమారు 20 కిలోమీటర్ల మేర నేషనల్ హైవే 563 పనులు కొనసాగుతున్నాయి. మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి, ఖాదర్‌గూడెం, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, శంకరపట్నం మండలం తాడికల్, శంకరపట్నం మొలంగూర్, కొత్తగట్టు మీదుగా జరుగుతున్నాయి. ఈదులగట్టెపల్లి, ఖాదర్‌గూడెం, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, మొలంగూర్ ఎక్స్‌రోడ్డు, కొత్తగట్టు స్టేజీల నుంచి ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, మొలంగూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులకు హాల్టింగ్ ఉంది. వందలాది మంది ప్రజలు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు.

చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి


కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. పనుల్లో భాగంగా ఇప్పటికే మొదటగా కరీంనగర్‌–వరంగల్ రోడ్డు వెంట ఉన్న చెట్లను తొలగించారు. బస్టాండ్లు, దుకాణ సముదాయాలు, నివాసాలను తొలగించడంతో ప్రాంతాలు ఏడారిని తలపిస్తున్నాయి. చేసేది లేక వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎండలో నిల్చొని బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తున్నారు. ఎండ, దుమ్ముధూళి భరిస్తూనే ప్రయాణం సాగిస్తున్నారు. తొలగించిన బస్టాండ్ల వద్ద తాత్కాలికంగా చలువ పందిళ్లు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని ఎప్పటికప్పుడు నీరు పట్టించాలని కోరుతున్నారు.

నీడ సౌకర్యం కల్పించాలి



పనినిమిత్తం హుజూరాబాద్ వెళ్లాలని చెంజర్ల స్టేజీ వద్దకు వచ్చాను. బస్సుల కోసం అరగంటకు పైగా ఎండలోనే వేచిచూశాను. నీడ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. తాత్కాలికంగా షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– సత్తయ్య, గంగపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



కరీంనగర్, హన్మకొండకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎండ, దుమ్ము ధూళితో నిలబడలేకపోతున్నాం. మహిళలు పిల్లలతో స్టేజీల వద్ద గంటల కొద్దీ బస్సులు, ఆటోల కోసం ఎండలోనే వేచి చూస్తున్నారు.

– పర్శయ్య, చెంజర్ల

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


తిమ్మాపూర్: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పూర్ణాహుతిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ ఆండాళ్, లక్ష్మీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 45వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన వెంకటాచార్యులు, శ్రీకాంతా శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్యాణోత్సవానికి మండలంలోపాటు చుట్టుపక్కల మండలాలు, కరీంనగర్ పట్టణం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణం సందర్భంగా స్థానిక గిరిజామృత్యుంజయేశ్వరస్వామి ఆలయం తరపున కమిటీ సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం ఎదుర్కోలు నిర్వహించారు. తిరుప్పావై సేవాకాలం, తదుపరి ప్రబోధకి ఆరగింపు సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, యాగశాలలో నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి కార్యక్రమం ముగించుకుని ఉభయ దేవరులతో కూడిన వేంకటేశ్వరస్వామివారిని మంగళ వాయిద్యాలు మధ్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేడుకలో విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధన్ ధారణ, నూతన యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, సజీరగుడ, మాంగళ్యధారణ, మహిళా భక్తులు అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు మారేమండ శ్రీకాంతాచార్యులు, మరింగంటి సుదర్శనాచార్యులు, తిరువరంగం శ్రీనివాసాచార్యులు, సముద్రాల అనంతరామాచార్యులు, రాఘవన్, భరద్వాజ, కలకోట నిఖిలాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, గౌరవ అధ్యక్షుడు పి.శివకుమార్, కార్యదర్శి వొంటెల రవీందర్‌రెడ్డి, కోశాధికారి పోలు కిషన్, మృత్యుంజయ ఆలయ కమిటీ చైర్మన్ చల్ల మోహన్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, మాజీ కమిటీ చైర్మన్ మామిడి రమేశ్, గంగారపు రమేశ్, కొల్లూరి వెంకటేశ్వర్‌రావు, వొంటెల ప్రసాద్, రాగి శ్రీనివాస్, బాలకిషన్‌రావు, బట్టు కర్నాకర్, దూలం ధనలక్ష్మి, సంధ్య, పరమేశ్వరి, గీత, తదితరులు పాల్గొన్నారు

వైభవంగా శివకేశవ జాతర

చొప్పదండి: పట్టణ శివారులోని శివకేశవాలయంలో గురువారం శంభుస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్మన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కౌన్సిలర్లు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పరిసరాల్లో జాతర, రథోత్సవం నిర్వహించగా భక్తులు స్వాగతం పలికారు. వివేకానంద యూత్ క్లబ్, వంశపారంపర్య అర్చకులు భక్తులకు ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేశారు.


తిమ్మాపూర్: వేంకటేశ్వరస్వామి కల్యాణం తిలకించడానికి భారీగా హాజరైన భక్తులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రశంస పత్రం అందుకుంటున్న గౌతంసాయి

గంగాధర: మండల కేంద్రంలోని వివేకానంద విద్యార్థి గౌతంసాయి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై జిల్లా జట్టు తరుపున ఆడినట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. 45వ రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు వరంగల్ జిల్లా పైడిపల్లిలో నిర్వహించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థిని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్, పీఈటీ శివాజీ, డైరెక్టర్ అనంతరెడ్డి, హెచ్‌ఎం ఉషారాణి అభినందించారు.

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.అఖిల, కె.అంజలి, ఎస్.అక్షిత రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. 15 నుంచి నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, పీడీ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టుదలతో చదవాలి


మానకొండూర్‌రూరల్: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మధుకర్ మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల ఉపన్యాసాలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాత్యాయిని, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు చెట్టు కొమ్మలు, ముగ్గులతో గణితం ఆకృతులు వేసి ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌శ్రీం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, శారద, గీత, రాణి, బాబు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం సుందరగిరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు ఫొటోలు దిగారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

ప్రొసీడింగ్ పత్రాల అందజేత


ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: మండలంలోని పలు గ్రామాలకు ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరు చేస్తూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ విడుదల చేసిన ప్రొసీడింగ్ పత్రాలను గురువారం బీజేపీ నాయకులు ఆయా కుల సంఘాల సభ్యులకు అందజేశారు. మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ, కమ్మరి, గౌడ, యాదవ సంఘాలకు రూ. లక్షాయాభై వేలు చొప్పున బోర్‌వెల్స్‌కు, పద్మశాలీ సంఘంకు రూ. 3 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్ , పొన్నం శ్రీనివాస్‌గౌడ్, ఉప్పు శ్రీనివాస్, కొలపురి రమేశ్, పోచంపల్లి నరేశ్, కారుపాకల అంజిబాబు, జిట్టవేని అంజిబాబు, కట్ల రవీందర్, ఎంపీటీసీ మోడీ రవీందర్, పలువురు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి పనులు

హుజూరాబాద్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎంపీ బండి సంజయ్ అనేక అభివృద్ధి పనులు చేశారని బీజేపీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. గాంధీనగర్‌లో నీటివసతి కోసం రూ. రెండు లక్షలు, కరీంనగర్ సైనిక్ స్కూల్, శాతవాహన యూనివర్సిటీకి 12–బి హోదా, జగిత్యాల్–వరంగల్, ఎల్కతుర్తి– సిద్దిపేట మధ్య రోడ్లు, ఆర్‌ఓ బ్రిడ్జి, ఎస్సాఆర్ఆర్ కాలేజీకి అటానమస్ గుర్తింపు, జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లకు హాల్టింగ్ వంటి పనులు చేశారని, కావాలనే కొంతమంది కాంగ్రెస్ , బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు నల్ల సుమన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగిశెట్టి ప్రభాకర్, శశిధర్, అంకతి వాసు, తిప్పబత్తిని రాజు, బొరగాల సారయ్య తదితరులు పాల్గొన్నారు .

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి


సైదాపూర్‌లో కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు


మానకొండూర్‌లో...

మానకొండూర్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంలో గురువారం పోలీసులు, సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ రాజుకుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

సైదాపూర్‌లో..

సైదాపూర్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చేపడుతున్న చర్యల్లో బాగంగా మండల కేంద్రంలో గురువారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


చొప్పదండి: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: పట్టణంలోని 11, 13వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం శంకుస్థాపన చేశారు. గౌడ సంఘం పైఅంతస్తు, సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించేందుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కమిషనర్ కె. నాగరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ గది నిర్మాణం పనులు ప్రారంభం

రామడుగు: మండలంలోని గుండి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సర్వశిక్షాభియాన్ నిధులతో నిర్మించే సైన్స్ ల్యాబ్ గది పనులను గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గది నిర్మాణం పూర్తయియితే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంపీడీవో రాజేశ్వరీ, తహసీల్దార్ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా చైర్మన్ ఆంజనేయులుగౌడ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు సత్యప్రసన్న, మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి, ఎంఈవో వేణుకుమార్, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ రమేశ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


గంగాధర: విద్యార్థులతో విజయేందర్‌రెడ్డి


హుజూరాబాద్: పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న రాము

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో రాణించడానికి పదవ తరగతి కీలకమని పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

హుజూరాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని బోర్నపల్లి జిల్లా పరిషత్ పాఠశాల పదో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదువులో రాణించాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని, మానవత్వ విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు కుర్నాల రాజేష్, జంగ వంశీ, లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు వినతి

జమ్మికుంట: ఆరె కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది ఆరె కులస్తులు ఉన్నారని పేర్కొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఆరెకుల నాయకులు

సంక్షిప్త వార్తలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి: పద్మశాలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండల, పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ చౌరస్తాలో చేనేత విగ్రహం ఎదుట క్షీరాభిషేకం చేశారు.

హుజూరాబాద్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. సిటీ సెంట్రల్ ఫంక్షన్‌హాల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

వీణవంక: రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కొండల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..

జమ్మికుంట: రాష్ట్రంలో 16 కార్పొరేషన్ల ఏర్పాటుతో పేదరికం నిర్మూలన అవుతుందని పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

సీఎంను కలిసిన వాసవి క్లబ్ అధ్యక్షుడు శరత్

జమ్మికుంట: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని జమ్మికుంట పట్టణ వాసవి వనిత క్లబ్ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

17న నేత్ర వైద్యశిబిరం

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 17న ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు ఉస్మాన్ పాషా, కార్యదర్శి విష్ణుదాస్ గోపాలరావు, ప్రచార కార్యదర్శి గంజి జయవర్ధన్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేడివిజన్ కంటి ఆసుపత్రి వైద్యులు హుజూరాబాద్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టు కుటుంబాలకు పరీక్షలు, అవసరమైన వారికి శస్త్ర చికిత్సకు పంపించనున్నట్లు వివరించారు. అవకాశాన్ని హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టు కుటుంబాలు వినియోగించుకోవాలని కోరారు.